# స్వప్న వాస్తవదత్త

సుబ్బారావు జీవితంలో యౌవనం తిరుగుతూంది. ప్రొద్దున్నే గడ్డం గీసుకొంటూ 'అబ్బాయ్! నీ జీవితం రంగు వెలిసిన కాగితంపువ్వు! పాలిపోయిన ఫొటోగ్రాఫ్! కాలిపోయిన ఎలెక్ట్రిక్ బల్బు! పదును మొద్దుబారిన రేజరుబ్లేడు' అని సుబ్బారావుతో సుబ్బారావు అద్దంలో అన్నాడు. కళ్ళక్రిందనల్లని అర్థచంద్రాకారపు ముడతల్ని చూసుకొని పెదవి విరిచాడు. గడ్డం తెగింది. రక్తం రాలేదనుకొనే లోపునే వచ్చింది. గంటుమీద పటిక అద్దాడు. చురుక్కుమంది. సగం చేసుకున్న గడ్డాన్ని అలాగే ఒదిలేద్దామనిపించేటంత చురుక్కు. వదిలేస్తే బాగుండదని గడ్డం పూర్తి చేశాడు. వెన్నెలరాత్రిలో నక్షత్రాలలాగ అక్కడక్కడ కనబడీ కనబడకుండా చూపుకి దొరక్కుండా చేతికి తగులుతూ వెంట్రుకలు మూలల్లో మిగిలిపోయాయి. సుబ్బారావు ఫరవాలేదనుకున్నాడు. రేజరుతోనే మీసాలు సవరించాడు. ఒకపక్క హెచ్చు' రెండోపక్క తక్కువ తెగింది. రెండింటినీ సరిసమానంగాపెట్టే యత్నంలో మీసం రూపేమారింది. చివరికి మీసం పూర్తిగా తీసేశాడు. మొహం పేడిమూతిగా, ఖాయిలా పడ్డవాడిలా తయారయింది. అందవికారం అయింది. 'అయినా ఇబ్బంది లేదు. నన్నుచూసి మెచ్చుకొనే వాళ్ళెవరున్నారులే' అని సుబ్బారావు మనస్సులో అన్నాడు.

నిజమే! సుబ్బారావునిచూసి మెచ్చుకొనేవాళ్ళు లేరు. అనాకారి కాకపోయినా అతని రూపాన్ని చూసి మోహించే

ఆడవాళ్ళు లేరు. స్నేహాన్ని కోరేవాళ్ళు కనబడరు. తనలో ఏదో పెద్దదోషం, తన ప్రవర్తనలో ఏదో లోపం ఉందనుకున్నాడు. తనలో తనకి పెద్ద అపనమ్మకం కలిగింది. తనమీద తనకి పెద్ద అనుమానం రగిలింది. విశ్వాసం తొలగింది. విరక్తి మిగిలింది. తనతోటివాళ్ళు ఏనాడో పెళ్ళిళ్ళు చేసుకొన్నారు. ఇప్పుడు పిల్లలతండ్రు లయ్యారు. చిన్న సుబ్రహ్మణ్యం అయిదేళ్ళకూతుర్ని వెంటపెట్టుకొని బజారొచ్చాడు. కూతురు ఏదో కొనిపెట్టమని మారాంచేసింది. సుబ్రహ్మణ్యం సముదాయించాడు. అప్పుడు అతడిలో ఏదో సంతృప్తి, సంతోషం సుబ్బారావుకి కనబడ్డాయి. ఇవన్నీ తనకు లేవే అన్నబాధ అతడిలో రాజుకొంది. అక్కడ ఇంక ఉండలేక సుబ్బారావు 'పనుంది వెళ్ళొస్తా' అని తప్పుకొన్నాడు. రామస్వామికివాళ్ళ పక్కంటివాళ్ళ అమ్మాయి ప్రేమలేఖలు రాస్తూంది. వాడితో ఆపిల్ల లేచి పోవడానికికూడా సిద్ధంగా ఉందట, సలహా చెప్పమని రామస్వామి సుబ్బారావుని అడిగాడు. ఏం చెప్పాలో తోచలేదు. రామస్వామిమీద అసూయ, ఈర్ష్య ముంచుకొచ్చాయి. తనతో లేచిపోవడానికి కాదుగదా, తనకు ప్రేమ లేఖలు రాయడానికి. తననిచూసి చిరునవ్వు నవ్వడానికికూడా ఏ ఆడదీ సిద్ధంగా లేదు. సుబ్బారావుకి దుఃఖంవచ్చింది.

యౌవనం మళ్ళిపోతూంది. పరిగెత్తి పరిగెత్తి పారిపోతూంది. అయినా అతడి మనస్సులో నిలిచే ఆడదానిని, అతడి జీవితాన్ని పంచుకునే సుందరిని, అతడి చూపుల్ని తనచూపులతో కట్టేసి అతడి భవిష్యత్తుని తనబ్రతుకులో జతచేసే అనురాగవతిని అతడు సంపాదించుకోలేకపోయాడు. సుబ్ర

హ్మణ్యం కూతురు మారాం చేస్తుంది. రామస్వామికి రోజుకో ప్రేమలేఖ వస్తూంది. సీతాపతి పెళ్ళి చేసుకోబోతున్నాడు. కామేశం పెళ్ళాన్ని పుట్టింట దిగబెట్టడానికి వెళ్ళాడు. అనంతరావు వాళ్ళ మేనమామ కూతురితో సినిమాల కొస్తాడు. సుబ్బారావు ఎక్కడికేనా పారిపోదా మనిపించింది. బిగ్గరగా అరవా లనిపించింది. ఉత్తపుణ్యానికి స్నేహితుల దవడమీద చాచి లెంపకాయకొడదా మనిపించింది. వెన్నెలరాత్రిలో గొడుగేసుకొని తిరగా లనిపించింది. కూరల మార్కెట్టులో పొట్లకాయలు మెడలో వేసుకొని న్యూస్ పేపర్లు ఇంటికిచుట్టబెట్టుకు తిరుగుదామనిపించింది. తను లోకవిరుద్ధంగా ఉంటున్న సంగతి తనకు తెలుసునని లోకానికి తెలియచేద్దామనిపించింది. తనమీద తనకి ఒళ్ళుమంట రెచ్చింది. ఏడుపొచ్చింది.

నూతిదగ్గర స్నానంచేస్తున్న సుబ్బారావు నూతిలో పడిపోదా మనుకున్నాడు. కాఫీతాగుతున్న సుబ్బారావు కాఫీలో విషం కలుపుకోందా మనుకొనేవాడు. బస్సులో ప్రయాణం చేస్తున్న సుబ్బారావు బస్సుకింద పడిపోదా మనుకొనేవాడు. ఆఫీసులో పద్దులురాస్తున్న సుబ్బారావు ఆ పుస్తకాలు చించేద్దామనుకొనేవాడు. ఎలక్ట్రిక్ స్తంభాన్నికి రెండుచేతులా రెండువైర్లు పట్టుకోందా మనుకొనేవాడు. సీత కాళ్ళదగ్గర కత్తి పెట్టి పొడుచుకొని ఆ రక్తంతో ఆమెపాదాలు కడుగుదా మనుకొనేవాడు. సీత రెండువందలమైళ్ళదూరంలో ఉంది. ఒకనాడు తన అందుబాటులోకి వచ్చింది తనని చూసి చిరునవ్వు నవ్వింది. లజ్జగా మొఖం వంచినట్టువంచి ఇష్టంగా చూసింది. తను మర్యాదగా భయపడ్డాడు. పిరికిగా మూగ

పోయాడు. వణుకుతూ కూర్చున్నాడు. ఇవాళ సీత రెండు వందలమైళ్ళ దూరాన కాపురం చేస్తోంది. సుఖంగా మర్చిపోయింది. హాయిగా బ్రతుకుతోంది. ఈ రెండువందలమైళ్ళు తిండీ నిద్రా లేకుండా నడిచివెళ్ళి సీతనిచూసి 'సీతా! ఆనాడు పొరపాటుచేశాడు' అని మారుమాటాడకుండా తిరిగివచ్చేదామనిపించింది. సుబ్బారావు కళ్ళు తుడుచుకున్నాడు, సీతని మళ్ళా తలచుకొన్నాడు.

నిన్నరాత్రి సుబ్బారావుకి కల వచ్చింది_ తను పిల్లలాడుకొనే ధమధమాబండికి అయిదుపోగుల జందెం కట్టి ఆఫీసుకు వెళుతూలాగుతున్నాడట. ఆ చిన్న బండిలో మరీ చిన్నసైజు సీత కూర్చుందట. కొంతదూరం వెళ్ళాక జందెం తెగిపోతే, సీత తన మంగళసూత్రం తీసి యిచ్చి దాన్ని బండికి కట్టమందట.

ఇది జ్ఞాపకం వచ్చి సుబ్బారావు బాధపడ్డాడు. సీత తనకోసం త్యాగాలు చేస్తుందనీ చెయ్యాలని అతడికోరిక. అది జన్మలో జరగదు. అందుకని కలలో తీర్చుకొంటున్నందుకు సుబ్బారావుమీద సుబ్బారావుకే జాలివేసింది. కోపమొచ్చింది. రామస్వామితో వాళ్ళ పక్కింటి అమ్మాయి లేచిపోవడానికి సిద్ధంగా ఉందని తెలిశాక. సీతకూడా తనతో లేచిపోతే బాగుంటుందేమో అన్న ఆలోచన తనకి తట్టాక, ఈ కల వచ్చిం దన్నమాట! అవినీతిగా ఆలోచిస్తున్నందుకు సుబ్బారావు సిగ్గుపడ్డాడు. తన కలలోని అంతరార్థం తనకే తెలిసిపోయినందుకు మరింత బిడియపడ్డాడు.

ఒంటరిగా కూర్చొని నిన్న రాత్రొచ్చిన కల గురించే సుబ్బారావు ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఆ చిన్న పిల్లల ఢమఢమాలబండికి అర్థం దొరకలేదు. సీతని తన పద్దెనిమిదో ఏటగాని అతడు తొలిసారిగా కలుసుకోలేదు. అటు వంటప్పుడు చిన్నతనపు ఆటలతో ఆమెని కలలో ఎందుకు ఊహించుకొన్నాడో అతడి కర్థం కాలేదు. ఢమఢమాల బండి సంకేతం బోధపడలేదు. అది ఈడుస్తూ తన ఆఫీసు కెళ్ళడం అంతకన్నా అవగాహన కాలేదు. కలలోని కారణా లలో ఈదలేక సుబ్బారావు అలసిపోయ్యాడు. లాభంలేదని ఊరుకొన్నాడు.

కళ్ళుమూసుకొని సిగరెట్టుకాలిస్తే కాల్చినతృప్తి ఉండదు.

బూటుకాలితో నిప్పుతొక్కితే బాధకలగదు.

కలలో కోరిక తీర్చుకొంటే ప్రయోజన ముండదు.

చిరిగిపోయిన లాల్చీమీద స్వెట్టరు తొడుక్కొని సుబ్బారావు వీధిగుమ్మీది కొచ్చాడు.

ఎదురింటి వాళ్ళబ్బాయి ఆ రేళ్ళవాడు పిల్లికూన తోక పట్టుకొని లాగుతున్నాడు. సుబ్బారావుకి పట్టరాని కోప మొచ్చింది.

ఒంటినిండా జ్వరం క్రమ్మింది.
తలలో ముసురు పట్టింది.
కాళ్ళకి చక్రాలొచ్చాయి.
చక్రాలు తిరిగేయి. పరిగెత్తాయి.
అబ్బాయి దగ్గర ఆగిపోయి.

సుబ్బారావు పిల్లికూన తోకలాగుతున్న కుర్రాణ్ణి నిప్పులో కాలిపోతున్న పెండెలం దుంపని లాగినట్టు చటుక్కున లాగేశాడు. వాణ్ణి ఎడా పెడా దవడమీదా, భుజం మీదా ఎక్కడ చెయ్యిపడితే అక్కడ బాదేశాడు. కుర్రాడు ఏడుస్తూ బొబ్బలుపెట్టడం సుబ్బారావుకి వినబడలేదు. ఏడుపు విని అక్కడికి వొచ్చిన కుర్రాడితల్లి నెత్తీ నోరూ మొత్తుకోడంకూడా వినబడలేదు.

కుర్రాడితల్లి తనని గొంగళీ పురుగుని లాగిపారేసినట్టు ఈడ్చేశాక, ఆ ఊపులో తమ పక్కనున్న సైడుకాల్వలో పడ్డాక, ఆ పడడంలో తలకి బొప్పికట్టాక సుబ్బారావుకి కొద్దిగా తెలివొచ్చింది. 'నీ చేతులు పడిపోనూ! కుర్రాణ్ణిలా కొట్టడానికి నీకు చేతు లెలా వచ్చాయిరా అనికుర్రాడితల్లి కోపంగా ప్రశ్నిస్తుంది. సుబ్బారావు తడుముకోకుండా 'ఏం మీ కుర్రాడుకూడా నాలాగ ఎందుకూ పనికి రాకుండా తయారవాలనా మీ ఉద్దేశం. మీ వాడినికూడా ఆడపిల్లలు చూసి అసహ్యించుకొంటే మీకు సంతోషం కాబోలు!' అని జవాబు చెప్పాడు.

ఈ జవాబులోని అర్థం ఆ యిల్లాలికి బోధపడక ఏడుస్తూన్న కుర్రాణ్ణి ఎత్తుకొని సుబ్బారావుని తిట్టుకొంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. గాని సుబ్బారావుకి తన జీవితంలో తను ఎందుకీ విధంగా తయారైనదీ చటుక్కున బోధపడ్డాది.

సుబ్బారావుని చూసి సుబ్బారావు అభిమానంతో నవ్వేడు. భయంలేదని సలహా ఇచ్చాడు.

తన జీవితంలోని చిన్ననాటి రోజుల పేజీలు సుబ్బారావు కళ్ళముందు వెనక్కి తిరిగాయి. తను ఆడపిల్లలతో ఆడుకోనేవయస్సింకా దాటనిరోజులు గ్యాపకంవచ్చాయి. తిరణాళ్ళలో కొనుక్కొన్న ఢమఢమాలబండికి పిల్లిపిల్లని కట్టి దాన్ని ఖాసింసాహెబు జట్కాగా వేద్దామనుకొన్నాడు. పిల్లిపిల్ల లొంగటంలేదు. ఢమఢమలబండిని పూయనివ్వటం లేదు. ఎగిరి గంతేసి అది పక్కవాటాలో అద్దెకుంటున్న వాళ్ళగదిలో దూరింది. తను దాన్ని వెంటాడేడు. పట్టుకొన్నాడు; అది పెట్టెల సందులోకి పారిపోతూవుంటే దాని తోకపట్టుకొని లాగాడు; పిల్లికూన తెగ అరిచింది; పక్కవాటా వాళ్ళ అమ్మాయి వరహాలు తన్ను చూసింది, పిల్లిపిల్లని వదిలెయ్యమంది; తను వదిలెయ్యలేదు; వదిలెయ్యకపోతే వరహాలు తన సహవాసం ఉండనంది. తను వినలేదు. పట్టుదలగా పిల్లిపిల్ల తోకని లాగాడు. అది రోషమొచ్చి తన మీదికి ఉరికింది. పంజాతో బక్కరించింది. తను ఏడిచాడు. వరహాలు నవ్వింది. తనంటే అసహ్యమైంది. తనతో మాట్లాడటం మానేసింది. వాళ్ళ ఆటల్లో తన్ను చేరనియ్యడం మానేసింది. ఆడపిల్లలందరు అతడి సహవాసం మానేశారు. వాళ్ళతో ఏదిమాట్లాడినా వెటకారం చెయ్యడం మొదలెట్టారు. ఆరోజునుంచి ఆడపిల్లలంటే తనకి అసహ్యంవేసింది. లోకంలో ఆడపిల్లలందరూ ఈ జన్మంలో తన సహవాసం ఉండరనిపించింది. అలా అనుకోడం తన తప్పేనని, ఇన్నాళ్ళకి సుబ్బారావుకి సుబ్బారావు సూయజుకాల్వలో పడ్డాక, తల బొప్పికట్టాక చెప్పాడు.

సుబ్బారావుకి తన కలలోని సంకేతాలన్నీ అర్థమయ్యాయి. గదిలోకిపోయి చిన్న నవ్వు నవ్వాడు. అద్దం ముందుకుపోయి ముఖం చూసుకున్నాడు. మళ్ళా నవ్వుకొన్నాడు. తనని చూసి తనకే నవ్వువచ్చింది. ఆడపిల్లలతో స్నేహంచెయ్యడంలో ఏనాడో చిన్నప్పుడు బొప్పికడితే, ఆ గుణపాఠం ఈనాటికి ఇప్పుడు సైడుకాల్వలో పడ్డాక బొప్పి కట్టాక అర్థం అయినందుకు, ఇంత ఆలస్యం అయినందుకు సుబ్బారావుకి నవ్వువచ్చింది. చేత్తో నుదుటిమీది బొప్పిని తడుముకున్నాడు. అది ఇంతింతవటు డింతై నమాదిరిగా పెద్దదవుతోంది. కొద్దిగా బాధపెడుతూంది. ఇందాకల గెడ్డం గీసుకొంటున్నప్పుడు గంటుపడితే పటిక అద్దగానే చురుక్కు-మన్నట్టు క్షణక్షణం చురుక్కు-మంటూ బాధపెడుతూంది. అ బాధలో కష్టంగాక సుఖాన్నే సుబ్బారావు అనుభవిస్తున్నాడు. సుఖం అనుభవిస్తూ సుబ్బారావు దగ్గరగా నవ్వాడు.

సైడుకాల్వలో పడ్డంచేత బట్టలన్నీ బురదయ్యాయి. స్వెట్టరు మరీను; సుబ్బారావు అది విప్పేశాడు. బట్టలు విప్పేసి గావంచాకట్టుకొని నూతిదగ్గరకివెళ్ళి సుబ్బారావు తనభయాలని కడిగేసుకొన్నాడు.

సుబ్బారావు మనస్సులో మరకలుపోయేటట్టు పాత జీవితాన్ని ఉతుకున్నాడు.

అతడు పరిశుభ్రంగా బట్టలువేసుకొని తలదువ్వుకొని పౌడరద్దుకొని బొప్పితడుముకొని రామస్వామినిసుబ్రహ్మణ్యాన్ని సీతాపతిని, అనంతరావుని, జీవితాన్ని, లోకాన్ని, అందరినీ, అంతటినీ నవ్వుతూ ఎదుర్కొ-నడానికి ... బయటకొచ్చాడు.